# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఛత్తీస్‌గఢ్ లో జరిగిన "బస్తర్ ఉత్సవం" గిరిజనుల సంస్కృతి, సంప్రదాయ వారసత్వాలను ప్రతిబింబించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ విపక్షాలు నోటీసు ఇచ్చాయి.
- ❖ సైబర్ నేరాల నుండి దేశాన్ని రక్షించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- ❖ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిదారుగా భారత్ అవతరించిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.
- ❖ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 17 నుండి భారతదేశంలో పర్యటించనున్నారు.

==================

ఛత్తీస్‌గఢ్ లో జరిగిన `బస్తర్ ఉత్సవం` గిరిజనుల సంస్కృతి, సంప్రదాయ వారసత్వాలను ప్రతిబింబించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గతంలో బస్తర్ పేరు ప్రస్తావించినప్పుడల్లా నక్సలిజం, హింస, అభివృద్ధిలో వెనుకబాటుతనం మాత్రమే గుర్తుకు వచ్చేవని, ఇప్పుడు పరిస్థితి పూరిగా మారిపోయిందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. బస్తర్ నేడు అభివృద్ధికి మాత్రమేకాక స్థానిక ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసానికి మారుపేరుగా నిలుస్తోందన్నారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంతో పాటు స్థానిక సమాజాలకు సాధికారత కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ ప్రాంతం రాబోయే కాలంలో శాంతి, పురోగతి, సాంస్కృతిక గర్వంతో విలసిల్లాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

==================

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ విపక్షాలు ఈరోజు నోటీసు ఇచ్చాయి. లోక్‌సభ సెక్రటరీ జనరల్ ను కలిసి నోటీసు ఇచ్చినట్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు గౌరవ్ గొగోయ్ వెల్లడించారు. ఇందుకోసం  వంద మందికి పైగా ఎంపీల సంతకాలను సేకరించాయన్నారు. స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ కు వ్యతిరేకంగా మొత్తం 118 మంది ఎంపీలు ఈ తీర్మానంపై సంతకాలు చేసినట్లు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా సభలో జరుగుతున్న పరిణామాలు, వరుస వాయిదాల నేపథ్యంలో విపక్ష నేతలు సుదీర్ఘ చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నోటీసును పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రాసెస్ చేస్తామని లోక్ సభ సెక్రటరీ జనరల్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

పీఎం-కిసాన్ పథకం కింద ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు 4 లక్షల కోట్ల రూపాయలకు పైగా పంపిణీ చేసిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రైతుల ఆర్థిక అవసరాలను తీర్చడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 2019లో ప్రారంభించిన పీఎం-కిసాన్ పథకం రైతులకు అనేక ప్రయోజనాలను చేకూరుస్తుందన్నారు. ఈ పథకం కింద సంవత్సరానికి 6 వేల రూపాయల ఆర్థిక ప్రయోజనం మూడు విడతలుగా బదిలీ చేయబడుతుందని తెలిపారు.ఈ పథకం కింద అన్ని చెల్లింపులు ఆధార్-సీడెడ్ బ్యాంక్ ఖాతాలలో ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానం ద్వారా జరుగుతాయని రామ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు.

అదేవిధంగా వీబీజీ రామ్ జీ చట్టం కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదని గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడానికి రూపొందించిన సమగ్ర చట్రమని ఆ శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ తెలిపారు. ఈ చట్టం ప్రతి గ్రామీణ కుటుంబానికి 125 రోజుల వేతన ఉపాధికి హామీ ఇస్తుందని లోక్‌సభలో మాట్లాడుతూ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభ కార్యకలాపాలకు ప్రతిపక్షసభ్యులు అంతరాయం కలిగిస్తున్నారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఈరోజు ఢిల్లీలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... సభ పట్ల వారికి ఎలాంటి గౌరవం లేదన్న విషయాన్ని వారి ప్రవర్తనే తెలియజేస్తుందన్నారు. గత వారం సభలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు ట్రెజరీ బెంచ్‌ను దాటారని, ప్రధానమంత్రి సీటు దగ్గరకు కూడా చేరుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించాలని అన్నారు. కాంగ్రెస్ ఎంపీల ప్రవర్తనపై బిజెపి మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిదారుగా భారతదేశం అవతరించిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. రాజ్యసభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ...  భారతదేశం ఇప్పటివరకు 272 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించిందని తెలిపారు. గతంలో కేవలం 2.8 గిగావాట్లు ఉన్న సౌరశక్తి సామర్థ్యం ఇప్పుడు 136 గిగావాట్లకు చేరుకుందని తెలియజేశారు. PM KUSUM పథకం దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం విజయవంతం కావడంతో అనేక రాష్ట్రాలు దీనిని విస్తరించాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఈ పథకం గ్రిడ్-కనెక్ట్ చేయబడిన పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల సంస్థాపనకు వీలు కల్పిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = =

ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విధానాల కారణంగా 2024-25లో జాతీయ జలమార్గాలపై రికార్డు స్థాయిలో 146 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరిగిందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు.

ఇది 2013-14లో 18 మిలియన్ టన్నులుగా ఉండేదని గుర్తు చేశారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలలో అంతర్గత జలమార్గాలలో మొత్తం పెట్టుబడి 1,700 కోట్ల రూపాయలకు చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం 111 జలమార్గాలు పనిచేస్తున్నాయని, ఇవి దేశంలో లాజిస్టిక్ ఖర్చులను తగ్గించడంలో సహాయపడుతున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = =

సైబర్ భద్రత ఇప్పుడు ప్రత్యక్షంగా దేశ భద్రతతో ముడిపడి ఉందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించిందని తెలిపారు. సైబర్ ఆధారిత మోసాలను ఎదుర్కోవడం, అందుకు సంబంధించిన వ్యవస్థను నిర్వీర్యం చేసే అంశాలపై  జాతీయ సదస్సును అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ - I4C ఒక ముఖ్యమైన వేదికగా మారిందన్నారు. సైబర్ భద్రత గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, మోసాల నుండి  దేశాన్ని రక్షించడం అన్ని ప్రభుత్వ విభాగాల బాధ్యత అని అమిత్ షా పేర్కొంటూ....

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 17వ తేదీ నుండి మూడు రోజుల పాటు భారతదేశంలో పర్యటించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు భారత్ లో అధికారికంగా పర్యటించనున్న మాక్రాన్ ఈ నెల 19న న్యూఢిల్లీలో జరిగే AI ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ఇరువురు నాయకులు హారిజన్-2047 రోడ్ మ్యాప్‌లో పొందుపరచబడిన విస్తృత రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇండో-పసిఫిక్ సహకారంతో సహా పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై కూడా చర్చిస్తారని ఆ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = =

సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన వరల్డ్ డిఫెన్స్ షో (WDS) 2026లో భారతదేశం తన స్వదేశీ రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించింది. ఈ నెల 8, 9వ తేదీలలో జరిగిన ఈ కార్యక్రమంలో భారత రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ నాయకత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పాల్గొంది. డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ (DPSUలు), భారతదేశ ప్రైవేట్ కంపెనీల తయారీ నైపుణ్యాన్ని ప్రదర్శించిన మొట్ట మొదటి ఇండియా పెవిలియన్ ను ఈ సందర్భంగా సంజయ్ సేథ్ ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రముఖులతో కలసి WDS ప్రారంభోత్సవాన్ని ఆయన వీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = =

టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా శ్రీలంకలోని కొలంబో వేదికగా పాకిస్థాన్, అమెరికా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి అమెరికా బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ 18 ఓవర్లకు  4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అంతకుముందు చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 15.2 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఆ లక్ష్యాన్ని ఛేదించింది. అలాగే ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్ లో నెదర్లాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = =